సాక్షి వనపర్తి
శనివారం ౹ 7 ౹ డిసెంబర్ ౹ 2024



జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే

అమృత్ 2. 0 ద్వారా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్లలో ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



అంబరాన్నంటిన సంబరాలు

జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సంబరాలు అంబరాన్నంటాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.3 /21.8

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రివేళ చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సంబరాలు

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో శనివారం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళీశాఖ జిల్లా అధికారి పి.గోవిందయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, ఉపాన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం 10మంది సీనియర్ చేనేత కార్మికులను సత్కరించడంతో పాటు చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ పథకం, చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలోని చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



కొత్తకోట: ఓపెన్ స్కూల్ ద్వారా ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రవేశానికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య తెలిపారు. కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సార్వత్రిక విద్యపీఠం ద్వారా ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ కోర్సుల్లో ప్రత్యేక ప్రవేశాలకు ఈ నెల 11 వరకు దరఖాస్తు గడువు పొడిగించారని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశ ఫీజును మీసేవ కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, కేశవాచారి, రామకృష్ణ, సత్యనారాయణ, పద్మావతి, విజయలక్ష్మి, సుధారాణి, నసియా, అక్షయ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ప్రారంభం



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో అసంపూర్తిగా నిలిచిన వనపర్తి – కొల్లాపూర్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారి సహకారంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రూ. 1.99 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, తిరుపతయ్య సాగర్, విష్ణు, ఊశన్న పాల్గొన్నారు.

శునకం.. భయానకం

ప్రజలను హడలెత్తిస్తున్న వీధి కుక్కలు



ఈ ఏడాది జూన్ నుంచి నమోదైన కుక్కకాటు కేసులు ఇలా..

నెల	కేసులు
జూన్	341
జులై	239
ఆగస్టు	281
సెప్టెంబర్	284
అక్టోబర్	294
నవంబర్	321
డిసెంబర్ 6వ తేదీ వరకు	10



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై సంచరిస్తున్న శునకాలు

- వీధులు, ప్రధాన రహదారుల్లో గుంపులుగా సంచారం
- వాహనదారులు, ప్రజలపై దాడులకు పాల్పడుతున్న వైనం
- ఏడు నెలల్లో 1,770 కుక్కకాటు కేసులు నమోదు
- నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు

సాక్షి ఫోకస్

వనపర్తిటౌన్: జిల్లాలోని పురపాలికల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధులు, ప్రధాన రహదారుల్లో గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడులకు ఎగబడుతున్నాయి. రోజూ ఏదో చోట కుక్కల దాడి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రోజురోజుకూ కుక్కల బెడద అధికం కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రివేళలో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. చిన్నారులను ఒంటరిగా పాఠశాలలు, బయటకు పంపేందుకు తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. జిల్లాలో కుక్కల నియంత్రణకు అధికార యంత్రాంగం కనీస చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. చీకటి పడితే వీధుల్లో తిరగలేని పరిస్థితి కొన్నిచోట్ల ఉంటే.. మరి కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా సమస్యగానే మారింది. చిన్నారులు, వృద్ధులు కుక్కల బారి నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

కనిపించని నియంత్రణ చర్యలు..

జిల్లాలో వీధి కుక్కల నియంత్రణ చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. కుక్కల నియంత్రణపై ఒక్కో పురపాలికలో భిన్న వాదనలు వినిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి వీధి కుక్కకు పిల్లలు కలగకుండా శస్త్రచికిత్స చేయాలి. కానీ కొన్ని పురపాలికలు ఇతర ప్రాంతాల్లో వదిలిపెట్టామని.. మరికొన్ని మున్సిపాలిటీలు శస్త్రచికిత్సలు చేయించి ఇతర ప్రాంతాల్లో వదులుతున్నామని చెబుతున్నారు. దీనికి తోడు కుక్కలను పట్టుకున్న చిత్రాలేవీ పురపాలిక యంత్రాంగం వద్ద అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ప్రతినెలా 300 మందికి పైగా కుక్కకాటు..

జిల్లావ్యాప్తంగా కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతినెలా సగటున 300 మంది వరకు కుక్కకాటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ తీసుకున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు 1,770 మంది జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందారు. మరో 2వేల మంది వరకు కుక్కకాటుకు గురై ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి కుక్కల వీరంగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ సంబంధిత అధికారులు కుక్కల నియంత్రణపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గాలు స్పందించి వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బెడద ఎక్కువైంది..



కొత్తకోటలో కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రి వేళ వీధుల్లో అరుస్తూ అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పగలు సైతం ఇళ్లలోకి చొరబడి దాడులు చేసే తరహాలో మీదకొస్తున్నాయి. కుక్కలను పట్టి దూరంగా తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. ఎక్కడా ఆ పరిస్థితులు కనిపించడం లేదు. పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం వీడాలి.

– లాల్‌కోట రవియాదవ్, 7వ వార్డు, కొత్తకోట

చర్యలు తీసుకుంటాం..

కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఇప్పటి వరకు 58 కుక్కలకు పిల్లలు కలగకుండా శస్త్ర చికిత్సలు చేయించాం. అన్ని మున్సిపాలిటీలకు దాదాపుగా ఒకే టీం పనిచేస్తోంది. కుక్కలు పట్టే బృందాలు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఇక్కడ కొంత జాప్యం ఏర్పడింది. కుక్కలకు ఎనిమల్ కేర్ సెంటర్‌లో శస్త్రచికిత్స అనంతరం పట్టణానికి దూరంగా వదులుతాం.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, వనపర్తి

ఊసే లేని కమిటీ పర్యవేక్షణ..

ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మున్సిపాలిటీ సిబ్బంది ప్రత్యేక టీంతో సంబంధిత ప్రాంతానికి వెళ్లి శునకాలను పడతారు. వాటికి ఏబీసీ శస్త్రచికిత్స నిర్వహించడంతో పాటు ర్యాబిస్ సూది మందు ఇచ్చి, మూడు రోజుల అనంతరం మళ్లీ అదే ప్రాంతంలో వదులుతారు. అయితే ఈ ప్రక్రియ మొత్తం మున్సిపల్ కమిషనర్, స్వచ్ఛంద సంస్థలు, పశువైద్యులతో కూడిన కమిటీ పర్యవేక్షణలో జరగాలి. అయితే ఏ రోజుకా రోజు ఎన్ని కుక్కలకు శస్త్రచికిత్సలు జరిగాయి.. తొలగించిన అవయాలను నిర్వీర్యం చేశారా లేదా అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. తద్వారా నకిలీ బిల్లులకు ఆస్కారం ఉండదు. కానీ పురపాలికల్లో కమిటీల పర్యవేక్షణ ఊసే లేకుండా పోయింది. కుక్కల నియంత్రణకు ఖర్చు చేసిన నిధుల వివరాలను సైతం వెల్లడించేందుకు అధికారులు వెనకాడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- వనపర్తి మున్సిపాలిటీలో 3,530 వీధి కుక్కలను గుర్తించారు. వాటిని పట్టి శస్త్రచికిత్స అనంతరం ఇతర ప్రాంతాల్లో వదిలేందుకు గాను ప్రత్యేక బృందాన్ని రప్పించారు. ఒక్కో కుక్కకు రూ. 1,650 చొప్పున చెల్లించి.. ఇప్పటి వరకు 58 కుక్కలకు శస్త్ర చికిత్స చేయించారు. అందుకు రూ. లక్ష వరకు ఖర్చు చేశారు.
- పెబ్బేరు పురపాలికలో 857 శునకాలను పట్టుకొని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఇందుకు గాను రూ. 3.50 లక్షలు ఖర్చు చేశారు.
- ఆత్మకూర్‌లో గత జూలైలో వీధికుక్కల తరలింపు ప్రక్రియ చేపట్టారు. మొత్తం 450 కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాల్లో వదిలిపెట్టారు. అందుకుగాను రూ. లక్ష ఖర్చు చేశారు.
- అమరచింతలో గతేడాది 400 కుక్కల వరకు పట్టుకొని పట్టణానికి దూరంగా వదిలిపెట్టారు. ఇందుకు రూ. 60వేలు ఖర్చు చేశారు. అయితే జిల్లాలోనే అత్యధికంగా అమరచింతలో ఆరు నెలల కాలంలోనే 14 మంది చిన్నారులు కుక్కకాటు బారినపడ్డారు.
- కొత్తకోట మున్సిపాలిటీలో 600 కుక్కలను పట్టుకున్నామని.. అందుకోసం ఒక్కో శునకానికి రూ. 300 చొప్పున ఖర్చు చేసినట్లు పుర అధికారులు వెల్లడించారు. ఇక్కడ 700 మందికి పైగా కుక్కకాటుకు గురికాగా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ అందించారు.

అర్హులకు లబ్ధి కోసమే ఇందిరమ్మ యాప్



గోపాల్‌పేట కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- 25లోగా సర్వే ప్రక్రియను పూర్తిచేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: అర్హులైన పేదలకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పారు. యాప్ ద్వారా చేపట్టే దరఖాస్తుదారుల సర్వే పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరిచేందుకు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. శనివారం నుంచే సర్వే ప్రక్రియ ప్రారంభం కావాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఈ నెల 25వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేకు సంబంధించి యాప్‌లో ఏవైనా సమస్యలు ఉంటే ఈడీఎంను సంప్రదించాలని సూచించారు. సర్వేయర్ రోజు 20 నుంచి 30 దరఖాస్తుల సర్వేను పూర్తి చేయాలని.. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షించాలని తెలిపారు.

నిబంధనలు పాటించాలి..

జిల్లాలో లే అవుట్ అనుమతుల మంజూరు విషయంలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లుతో కలిసి లే అవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ముందుకు వచ్చిన లే అవుట్ల దరఖాస్తులపై సుదీర్ఘంగా చర్చించారు. లే అవుట్ అనుమతి కోసం దాఖలైన అర్జీలను గరిష్ఠంగా 21 రోజుల్లోపు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కమిటీలో ఉన్న మున్సిపల్ శాఖతో పాటు, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సైట్‌ను పరిశీలించాలని.. నిబంధనలకు లోబడి ఉంటేనే ఆన్‌లైన్‌లో ఆమోదాన్ని తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్

గోపాల్‌పేట: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం న్యూటన్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోడింగ్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోడింగ్‌పై పట్టుతో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. తద్వారా భవిష్యత్‌లో ఉత్తమ లక్ష్యాలు సాధించవచ్చన్నారు. కోడింగ్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఓ దీప్తిని ఆదేశించారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఐకేపీ ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అత్యవసర మందుల కొరత రానివ్వకూడదని డా.కృష్ణకుమారికి సూచించారు. వారి వెంట డీఈఓ అబ్దుల్ ఘని, డీపీఓ గోవింద్ నాయక్, డీజీసీఓ సుబ్బలక్ష్మి, తహసీల్దార్ తిలక్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం



అమరచింతలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత/ఆత్మకూర్: ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం అమరచింత తహసీల్దార్ కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సింగంపేట గ్రామంలో రూ. 12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆత్మకూర్ మండలం గుంటిపల్లిలో రూ. 20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు దేవరపల్లిలో ఎమ్మెల్యే నిధులు రూ. 2.50లక్షలతో ఏర్పాటుచేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆత్మకూర్‌లో ఎల్లమ్మ దేవర్లకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. నియోజక వర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తుండటం చూడలేని ప్రతిపక్షాలు.. లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని విమర్శించారు. తెలంగాణను పదేళ్లపాటు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ అప్పుల రాష్ట్రంగా మార్చిందని ధ్వజమెత్తారు. కాగా, సింగంపేట పాఠశాలకు ప్రహరీ, అదనపు గదులు నిర్మించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ రవికుమార్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, విష్ణు, పరమేశ్, రహ్మతుల్లా, తులసీరాజ్, గణేష్, చిరంజీవి, వినయ్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, రఫీక్, మశ్చేందర్‌రెడ్డి ఉన్నారు.

ఆరోపణలు మాని సూచనలు చేయండి

వనపర్తి: జిల్లా అభివృద్ధిపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం మానుకొని సూచనలు చేస్తే స్వీకరిస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఉండగా.. తాము అధికారంలోకి వచ్చాక సుమారు రూ. 282 కోట్లకు పైగా చెల్లింపులు చేసి పనులు చేయిస్తున్నామన్నారు. ధనిక రాష్ట్రం అప్పుల పాలైతే.. ఒక కుటుంబం, పలువురు బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఆరోపించారు. ధరణి స్థానంలో భూమాత సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చి, గ్రామాల్లో కుటుంబాల మధ్య నెలకొన్న భూతగాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఒక్క కార్డుతో ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం అందుకునేలా ఆధునిక సాంకేతికతతో రూపొందిస్తున్నామన్నారు. వనపర్తి అభివృద్ధి కోసం పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని.. త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. ఇరిగేషన్, ఇందిరమ్మ ఇళ్లు ఇతర అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నూతన జేఎన్‌టీయూ భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించామన్నారు. పెబ్బేరును నూతనంగా రెవెన్యూ డివిజన్ చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఆయిల్‌పాం ప్రాసెసింగ్ యూనిట్, మరో పోలీస్ సర్కిల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, పెద్దమందడిలో వేరుశనగ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

సాగని లింక్ కెనాల్

నిలిచిపోయిన సింగోటం-గోపల్‌దిన్నె కెనాల్ పనులు

- ప్రధాన అడ్డంకిగా మారిన భూ సేకరణ సమస్య
- రూ.147.7 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పూర్తయితే 34 వేల ఎకరాలకు ఉపయోగం
- ఆశగా ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతాంగం



గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో తవ్విన కాల్వ

కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు కూడా సాగునీరందించాలనే ఉద్దేశంతో చేపట్టిన సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు ముందుకు సాగడం లేదు. భూ సేకరణ సమస్య కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ కెనాల్‌పై ఐదు మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. కెనాల్ పూర్తయితే సాగునీటి సమస్యలు తీరుతాయని భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూడా పనుల్లో పురోగతి కనిపించకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

వేలాది ఎకరాలు..

జూరాల ఎడమ కాల్వ పరిధిలో చివరి ఆయకట్టు కింద కొల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రైతులకు రబీ సీజన్‌లో రెగ్యులర్‌గా సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందు కోసం సింగోటం- గోపల్‌దిన్నె లింకు కెనాల్‌కు శ్రీకారం చుట్టారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని మళ్లించే విధంగా ఈ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గత ప్రభుత్వం రూ.147.7 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం టెండర్లు పూర్తిచేసి, పనులు ప్రారంభించింది. గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు అనుసంధానంగా 5 కి.మీ మేరకు కాలువలను తవ్వారు. తర్వాత భూసేకరణ పేరుతో పనులు ఆగిపోయాయి.

మంత్రి జూపల్లి సమీక్ష..

వనపర్తి జిల్లా పరిధిలో 200 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో వంద ఎకరాలు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ అసంపూర్తిగానే ఉంది. గత ప్రభుత్వం ఈ పనుల పూర్తికి ప్రయత్నించినప్పటికీ వివిధ రకాల కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలో గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు కెనాల్ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కెనాల్ తవ్వకాలకు అవసరమైన భూ సేకరణ అంశాలపై చర్చించారు. పనుల పూర్తికి సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించినా.. కదలిక మాత్రం రాలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



లింక్ కెనాల్ తవ్వకాల కోసం అవసరమైన భూ సేకరణకు చర్యలు చేపట్టాం. గ్రామాల వారీగా రైతులతో గతంలో మాట్లాడాం. మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా పనుల పురోగతి గురించి ఆరాతీశారు. ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను తెలియజేశాం. కెనాల్ పనులకు సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

తాగు, సాగునీటి సమస్యలు..

సింగోటం– గోపల్‌దిన్నె లింకు కెనాల్ వల్ల కొల్లాపూర్ నియోజకవర్గంలో ఐదు మండలాల రైతాంగానికి మేలు జరగనుంది. వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతుంది. పాన్‌గల్ మండలంలో కొంత మేరకు సాగునీరు అందుతుంది. లింక్ కెనాల్‌కు తూములు ఏర్పాటు చేసి సమీపంలోని చెరువులు, కుంటలకు నీళ్లు మళ్లించేలా డిజైన్లు రూపొందించారు. లింక్ కెనాల్ ద్వారా నీటి సరఫరా ప్రారంభమైతే జూరాల లెఫ్ట్ కెనాల్ కింద ఉన్న 24,500 ఎకరాల ఆయకట్టు, రాజీవ్ భీమా కాల్వ కింద ఉన్న 9,500 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు లభిస్తుంది. అలాగే వేసవిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కింద ఉండే పలు గ్రామాలకు తాగునీటి సమస్యలు కూడా తీరుతాయి.

పాలమూరుకు నవోదయ విద్యాలయం మంజూరు

పాలమూరు: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయగా అందులో ఒకటి మహబూబ్‌నగర్ జిల్లా కూడా ఉండటం విశేషం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు నవోదయ విద్యాలయం ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఎంపీ డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు. నవదోయ విద్యాలయం జిల్లాకు రావడం వల్ల పాలమూరులోని పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్న ఈ పాఠశాలలో 560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

క్లుప్తంగా

పంప్‌మోడ్ పద్ధతిలో నీటి తరలింపు

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి 4,856 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,589, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

తాగు నీటికోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 390క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 45 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చారకొండ: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాలు.. కల్వకుర్తి నుంచి దేవరకొండకు బొలెరోలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చారకొండలో వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నారు.ఆర్ఐ రామకృష్ణ పంచనామా నిర్వహించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎన్ఆర్ క్వింటాల్ రూ.2,739



జడ్చర్ల/నవాబుపేట: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్ఎన్ఆర్ క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,739, కనిష్ఠంగా రూ.1,866, హంస గరిష్ఠంగా రూ.2,200, కనిష్ఠంగా రూ.1,929, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,417, కనిష్ఠంగా రూ.2,240, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,197, కనిష్ఠంగా రూ.5,790, జొన్నలు రూ.2061 ధరలు లభించాయి.

■ నవాబుపేట మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది.5,590 బస్తాల ధాన్యం రావడంతో మార్కెట్ నిండిపోయింది. ధాన్యం ఎక్కువగా రావడంతో అదనంగా టెండర్లు వేయాలని రైతులు కోరారు. ఆదివారం కూడా టెండర్లు జరుగుతాయని, ధాన్యాన్ని బట్టి అదనపు టెండర్లు వేసేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ లింగం తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



భూత్పూర్: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డా.కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. వైద్యసిబ్బంది తమవిధులు సక్ర మంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో ఎంత మందిని డెలివరీ చేశారని, నెలవారీ వివరాలు తెలిపే బోర్డును ఆస్పత్రిలో ఎందుకు పెట్టలేదని వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డెలివరీ వివరాలు కూడా చెప్పకపోవడంపై డీఎంహెచ్ఓ మండిపడ్డారు.

వ్యక్తిపై కోతి దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో వ్యక్తిపై కోతి దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తాడూరు మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి వ్యక్తిగత పనులపై జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చాడు. అకస్మాత్తుగా అతనిపై కోతి దాడి చేసింది. ఈ ఘటనలో మద్దిలేటికి స్వల్ప గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- డిగ్రీ కళాశాల మైదానంలో డ్రోన్ పాయింట్ సర్వే
- మున్సిపాలిటీలోని ప్రతి ఇల్లు ఇక డిజిటలైజేషన్
- సర్వే అనంతరం డీటీసీపీకి బేసిక్ మ్యాప్ అప్పగింత
- మాస్టర్‌ప్లాన్ అమలుకు కీలకం కానున్న డిజిటల్ సర్వే

జడ్చర్ల టౌన్: అమృత్ 2. 0 ద్వారా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సర్వే ఆఫ్ ఇండియా బృందం అర్బన్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రారంభమైంది. పట్టణాల అభివృద్ధి కోసం రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద డిజిటల్ సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో డిజిటల్ సర్వేకు ఎంపికై ంది జడ్చర్ల ఒక్కటే కావడం విశేషం. సర్వేలో భాగంగా పట్టణ విస్తీర్ణంతోపాటు అటవీ ప్రాంతం, చెరువులు, కుంటలు, నాలాలు, నివాసాలు కుటుంబాల గుర్తింపుతో కూడిన బేస్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.



డ్రోన్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్

డ్రోన్ సహాయంతో..

డ్రోన్ సహాయంతో చేపట్టిన డిజిటల్ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు. సర్వేలో ఏ అంశాలు నమోదు చేస్తారు అనే విషయాలను సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు వారికి తెలియజేశారు.

డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా..

మున్సిపాలిటీ 35 స్క్వేర్ కి.మీటర్లు డ్రోన్ సహాయంతో డిజిటల్ సర్వే చేయనున్నారు. పదిరోజులపాటు జరిగే సర్వేను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా ప్రారంభించారు. 5 స్క్వేర్ కి.మీ., మేర ఇక్కడి నుంచి సర్వే చేయనున్నారు. అనంతరం పట్టణంలోని మరో 5 కేంద్రాలను ఎంపిక చేసుకుని అక్కడి నుంచి సర్వే కొనసాగించనున్నారు.

> “
> **పది రోజులపాటు..**
>
> 
>
> మున్సిపాలిటీకి సంబంధించి బేసిక్‌మ్యాప్ సిద్ధం చేయడంతోపాటు అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయనున్నాం. పదిరోజులు పాటు డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీలోని అన్ని వివరాలు నమోదు చేస్తాం. ప్రభుత్వ స్థలాలు, ఇండ్లు, నాలాలు, చెరువులు, కుంటల వివరాలు అన్ని డిజిటలైజ్ చేస్తాం. డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా 5 స్క్వేర్ కి.మీటర్లు సర్వే చేస్తాం. పట్టణంలోని మరో 4 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసుకుని సర్వే పూర్తిచేస్తాం. – గోపాల్‌రావు, సర్వేయర్, సర్వే ఆఫ్ ఇండియా
>
> **లెక్కింపు సులభం**
>
> 
>
> సర్వే ఆఫ్ ఇండియా, అర్బన్ టౌన్ ప్లానింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే శుక్రవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ బేస్ మ్యాప్ సిద్ధం చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటిని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి డిజిటలైజేషన్ చేయడం వల్ల పన్నుల లెక్కింపు సులభమవుతుంది. పట్టణ విస్తీర్ణం పెరుగుతుండటంతో సర్వే ద్వారా మౌళిక అవసరాలు గుర్తించవచ్చు. – లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

అన్నీ డిజిటలైజేషన్..

డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి వివరాలతో బేసిక్ మ్యాప్ సిద్ధం చేస్తారు. వీటిలో మున్సిపాలిటీ విస్తీర్ణం, హద్దులు గుర్తించనున్నారు. అలాగే అటవీ విస్తీర్ణం, ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు, నివాస గృహాలు, నాలాలు, కాల్వలు, రోడ్లు అన్నింటిని గుర్తించి డిజిటలైజేషన్ చేస్తారు. ప్రతి ఇంటి విస్తీర్ణం లెక్కించి డిజిటలైజేషన్ చేసి రికార్డు అన్నింటిని డీటీసీపీకి పంపిస్తారు. అక్కడి నుంచి తిరిగి మున్సిపాలిటీకి నివేదికలు చేరుతాయి. వాటి ఆధారంగా ఇంటి పన్నుల లెక్కింపు, ప్రభుత్వ స్థలాలను గుర్తించడం చేస్తారు. వీటితోపాటు భవిష్యత్ 20 ఏళ్ల కోసం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు డిజిటల్ సర్వే ఉపయోగపడుతుంది. అమృత్ 2.0 డిజిటల్ సర్వేలో చేసిన డిజిటలైజేషన్ ఆధారంగా నక్ష పథకం అమలుకు దోహదపడనుంది.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



వీసీ శ్రీనివాస్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫార్మసీ ఆడిటోరియంలో పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డిగ్రీ, పీజీలో ఫ్యాకల్టీని నియమించుకోవాలన్నారు. విద్యార్థినుల సంరక్షణ కోసం ప్రత్యేక వాష్ రూంలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులతో విద్యార్థులను వేధించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి రాజుకుమార్, జేడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

ఆపదలో ఉన్న వాళ్లకు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుదామని వీసీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రక్తదానం చేయడంపై చాలా మందిలో అపోహాలు ఉంటాయని అలాంటివి పెట్టుకోవద్దన్నారు. సామాజిక సేవలో భాగంగా బ్యాంక్ వారు రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, బ్యాంక్ క్లస్టర్ హెడ్ అశోక్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ అశ్విన్, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు



జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు బోగిలో పొగలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- జడ్చర్ల స్టేషన్‌లో నిలిపివేత
- ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పిన సిబ్బంది

జడ్చర్ల టౌన్: కాజీపేట నుంచి రాయచూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి శుక్రవారం బొగ్గు తీసుకువెళ్తున్న గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు రావడంతో పైలెట్, కో పైలెట్‌లు గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కాజీపేట స్టేషన్ నుంచి బొగ్గు లోడ్‌తో గూడ్స్ రైలు రాయచూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో శంషాబాద్ సమీపంలో బొగ్గు క్యాబిన్ నుంచి పొగలు రావడంతో అక్కడ నిలిపివేసి ఫైరింజన్ సహాయంతో ఆర్పేశారు. పొగలు ఆరిపోయాక తిరిగి గూడ్స్ రైలు బయలుదేరింది. అయితే గొల్లపల్లి స్టేషన్ సమీపంలో తిరిగి పొగలు వస్తుండటాన్ని పైలెట్, కోపైలెట్ గమనించి జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని బొగ్గు క్యాబిన్‌లోని పొగలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే బొగ్గు సరఫరాలో ఇలాంటివి సర్వసాధారణమని, బొగ్గు వేడి కారణంగా పొగలు వస్తాయని, వాటిని ఆర్పుతూ ముందుకు వెళ్తామని సిబ్బంది చెప్పారు.

కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లీ

అమరచింత: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లీ అన్నారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ.. నిరంకుశంగా పరిపాలిస్తుందన్నారు. కార్మిక, కర్షక వర్గానికి సంబంధించిన 29 చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేబర్ కోడ్‌లతో కార్మికులు కనీస వేతనాలు అడిగే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. వ్యవసాయ కూలీల కోసం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని.. ప్రజల మధ్య మతచిచ్చు పెడుతూ మతోన్మాదాన్ని పెంచుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, జీఎస్ గోపి, రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్, వెంకటేష్, హరికృష్ణ, రేణుకలత, వసంత పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు



అమరచింత: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ మందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ దామోదర్ హెచ్చరించారు. మండలంలోని అమరచింత, చింతరెడ్డిపల్లె, ఈర్లదిన్నె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని.. లేని పక్షంలో పంటలకు సకాలంలో ఎరువులు అందక దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను కొనేటప్పుడు పీఓఎస్ యంత్రంలో ఎంట్రీ చేసిన తర్వాతే కొనాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఓ అరవింద్, ఏఈఓ మల్లేష్ ఉన్నారు.

కల్తీ ఆహారం విక్రయాలపై నిఘా

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార విక్రయాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ అన్నారు. శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్ సూచన మేరకు పోలీసు బృందంతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార నిబంధనలు పాటించని సంగీత, ఇతర హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మరికొన్ని హోటళ్ల యజమానులకు నిబంధనలు పాటించాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కాగా, కొన్ని హోటళ్లలో ఆహారం కొనటమంటే.. డబ్బులిచ్చి అనారోగ్యం కొన్నట్టు ఉందని అందిన ఫిర్యాదులకు స్పందించిన ఎస్పీ.. హోటళ్ల తనిఖీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంట సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

అంబరాన్నంటిన ప్రజాపాలన సంబరాలు



కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 'ప్రజా ప్రభుత్వం పిలిచింది' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రముఖ కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం ప్రదర్శనలు ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తిలకించారు. తెలంగాణ పోరాటయోధుల వీరగాథలు, పోతరాజులు, బతుకమ్మ నృత్యాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమోంటోలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ సీతారాం, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్య పద్ధతులు



బిజ్జారం శివారులో యాసంగి కోసం వేసిన నారుమడి

- విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ
- జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

కోస్గి: యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో వరిసాగు చేసే రైతులు వరినారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బోరు బావుల కింద వరిసాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు పాటించాల్సిన నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ వివరించారు.

విత్తన శుద్ధి

నారుపోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. 1 కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. 1 కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముప్ప పురుగు ఆశించకుండా ఉంటాయి.

అధికారి సలహా



జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

నారుమడి తయారీ

■ నారు పోయాల్సిన మడిని 10–12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.

■ ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చదరపు మీ.) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.

■ 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

కలుపు నివారణ

■ నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారి చేయాలి.

నాటు వేసుకునే విధానం

నాటు వేసే నారులో 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంది. నాట్లు వేసేటప్పుడు భూ సారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటర్‌కు 44 దంట్లు(నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.

■ విత్తిన 15 రోజులకు సైహాలో పాస్ బ్యూటైట్ 10 శాతం మందు 400 మీ.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

■ విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోపాస్ 1.6 మీ.లీ మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.

■ జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.

చలి ప్రభావం నుంచి రక్షణ..

యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతోపాటు కొన్నిసార్లు నారుమడి చనిపోవడం జరుగుతుంది. ఇందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

■ సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటిపూట వెచ్చటి నీరు పెట్టాలి. – రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.

■ జింక్ లోపం వలన ఆకులుపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

వైద్యుల సూచనలు పాటించాలి



ఖిల్లాఘనపురం: సహజంగా వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు తరచూగా పెయిన్ కిల్లర్స్ వాడటం మంచిది కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు రాజశేఖర్, నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఫిజియోథెరపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరచూగా పెయిన్ కిల్లర్ మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్ ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఎక్కువగా సెల్‌ఫోన్ వాడకంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం మునావర్ సుల్తానా పాల్గొన్నారు.

ఈ-చలాన్స్‌పై స్పెషల్ డ్రైవ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం విస్తృతం వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్‌కు విధుల శిక్షణలో భాగంగా ట్రాఫిక్ విధులు ఎలా నిర్వహించాలి, వాహనదారులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశంపై ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ కేసులను పరిశీల నలో భాగంగా ఆయా వాహనాలు నిలిపి సదరు వాహనాలపై పెండింగ్ చలాన్స్ పరిశీలించారు.